క్లుప్తంగా

జైనుల నిరసన ర్యాలీ

డోర్నకల్ : కర్ణాటకలోని బలగని జిల్లాలో ఈనెల 8న జైనముని శ్రీరాంకుమార్ నందిజీ మహారాజ్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆ మతస్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జ్వర సర్వే

డోర్నకల్ : కొద్ది రోజులుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని అమ్మపాలెం గురువారం జ్వర సర్వే నిర్వహించారు. ఏఎన్ఎంలు పద్మ, సువర్ణ, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి జ్వర సర్వే చేశారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని చెప్పారు.

రైల్వే గేట్‌కు డీసీఎం ఢీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని 'ఏ' క్యాబిన్ రైల్వే గేటును ఓ డీసీఎం గురువారం ఢీకొట్టింది. ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎంవీ.రావు కథనం ప్రకారం.. ఓ డీసీఎం పాత బజారు నుంచి కొత్త బజారుకు వెళ్లే క్రమంలో ఓ కారును తప్పించే క్రమంలో అప్‌లైన్ వైపున్న రైల్వే గేటును ఢీకొట్టింది. గేటు విరిగింది. స్లైడింగ్ బూం గేటును వినియోగించి యథావిధిగా రైళ్ల రాకపోకలను కొనసాగించే చర్యలు చేపట్టారు.

'బీఆర్‌ఎస్‌ది నియంత పోకడ'

మరిపెడ : బీఆర్‌ఎస్ పార్టీది నియంత పోకడ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లెట్ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అన్ని పార్టీలకు ఉందన్నారు. కిషన్‌రెడ్డిని అడ్డుకుని పోలీసులు అత్యుత్సాహం చూపారని తెలిపారు. అరెస్టులతో ఉద్యమం ఆగదన్నారు.

రేపు మండల సభ

నర్సింహులపేట : మండల పరిషత్ కార్యాలయంలో రేపు (శనివారం) మండల సభ నిర్వహిస్తామని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ టేకుల సుశీల అధ్యక్షతన సభ ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మంత్రి పరామర్శ

తొర్రూరు రూరల్ : మండలంలోని కంఠాయపాలెంకు చెందిన కామగాని సోమయ్య మృతి చెందగా అతడి కుటుంబాన్ని, కొడుకు శ్యామ్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. తొలుత సోమయ్య మృతదేహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సీతారాములు, రైతుబంధు జిల్లా సభ్యుడు కిశోర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీటీసీ దేవమ్మ పాల్గొన్నారు.

గోపా ఆధ్వర్యంలో..

తొర్రూరు : సర్వాయి పాపన్న అసోసియేషన్ ప్రతినిధి కక్కెర్ల సూర్యనారాయణ ఇటీవల మృతి చెందగా పట్టణంలో బాధిత కుటుంబాన్ని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ పరామర్శించారు. అలాగే రూ.20 వేల సాయం అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. గౌడ సామాజికవర్గ ప్రతినిధులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, ఎస్ఎస్‌పీజీపీ కోటగిరి కుమార్, ప్రతినిధులు ఉమ్మగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

చిన్నగూడూరు : మండలంలోని గుండంరాజుపల్లికి చెందిన సీపీఐ నాయకుడు లింగయ్య గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి గంజి శేషాద్రిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్, స్టాలిన్ పాల్గొన్నారు.

అర్హులకే దళితబంధు ఇవ్వాలని వినతి

మహబూబాబాద్ : దళితబంధు పథకం అర్హులకే అందాలని కోరుతూ కలెక్టర్ కె.శశాంకకు సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్ గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సోమయ్య, రామ్మూర్తి, మహేష్ మాట్లాడారు. దళితబంధు పథకం దళారుల పాలుకాకుండా చూడాలని కోరారు.

శ్రీసాయి మందిరంలో డీఎస్పీ పూజలు



మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలోని సాయి బాబా విగ్రహానికి డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ గురువారం పూజలు చేశారు. తొలుత ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై మంగాచార్యులు, రామానుజాచార్యులు వేద మంత్రాలతో షిర్డీ సాయినాథుడి సన్నిధిలో అష్టోత్తర శతనామావళి, అర్చన పూజలు చేయించి డీఎస్పీకి ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించారు. డీఎస్పీ వెంట టౌన్ సీఐ ఎడ్లపల్లి సతీష్ ఉన్నారు.

జోరువాన.. ఉప్పొంగుతున్న వాగులు



తొర్రూరు రూరల్ : గుర్తూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు

బయ్యారం : మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా జోరువాన కొనసాగింది. పందిపంపుల, మసివాగు, రాళ్లవాగు, ఉమ్మలేరు, వట్టేరు, పాఖాలేరు ప్రమాదకర స్థాయిలో వరద నీటితో ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గురువారం సాయంత్రం 16.3 అడుగుల నీటి సామర్థ్యం ఉన్న బయ్యారం పెద్ద చెరువులో 12 అడుగుల మేర నీరు చేరింది. ఉడుములవాగు ప్రవాహం రహదారిపైకి చేరటంతో మండలంలోని మొట్లతిమ్మాపురం–బయ్యారం నడుమ, పెద్దవాగు ప్రవాహంతో కోయగూడెం–కిష్టాపురం నడుమ రాకపోకలు నిలిచాయి. ఉడుముల వాగును దాటకుండా తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ చలపతిరావు, ఎస్ఐ ఉపేందర్ బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కనువిందు చేస్తున్న జలపాతాలు

మండలంలోని బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం, చింతోనిగుంపు సమీపంలో ఉన్న బొల్లి జలపాతాలు సందర్శలకు కనువిందు చేస్తున్నాయి. ఓవైపు వర్షం కురుస్తుండగా పర్యాటకులు జలపాతాలను చూసేందుకు వస్తున్నారు.

తొర్రూరు రూరల్ : వర్షాలతో నీటి ప్రవాహం పెరిగి మండలంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండడంతో మత్తడి పడే అవకాశం ఏర్పడింది. గుర్తూరు గ్రామ శివారులోని ఆకేరు వాగు పొంగి పొర్లుతోంది.

కూలిన విద్యుత్ స్తంభం

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ లాలాబహదూర్ పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం కూలిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వర్షం కురుస్తుండగా స్తంభం కూలింది. ఎవరికీ అపాయం చోటు చేసుకోలేదు.

గూడూరు: మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మీదేవి చెరువు వర్షాలకు అలుగుపోసింది. చెరువు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాకాలవాగులో నీటి ఉధృతి

మండలంలోని పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



డోర్నకల్ : శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

డోర్నకల్ : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీతో కలిసి గురువారం ఆయన పర్యటించి శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భద్రునాయక్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహబూబాబాద్ : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పలు డ్రైనేజీలను పరిశీలించి సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, శ్రీనివాస్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సెంటర్ : వర్షాలకు 36వ వార్డులో చెట్టు, విద్యుత్ స్తంభం కూలిపోగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి సందర్శించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫెన్సింగ్ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ నవ్యశ్రీ, సిబ్బంది ఖరీద్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : మండలంలోని చెంద్రుగూడెంలో, తండాల్లో నిలిచిన వర్షపు నీటిని సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ జేసీబీలతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో చేరేలా చొరవ చూపాలని ఆకాంక్షించారు.

పాలేరు వాగును పరిశీలించిన ఎంపీడీఓ

దంతాలపల్లి : మండలం పెద్దముప్పారం గ్రామ సమీపంలోని పాలేరు వాగును ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం రామవరం, రామానుజపురం గ్రామాల్లోని నర్సరీలను ఆమె పరిశీలించి వర్షాలకు మొక్కలు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీఓ అఫ్సర్ పాషా తదితరులున్నారు.

నెల్లికుదురు : మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లిలో కొట్టం వెంకన్నకు చెందిన పూరిల్లు కూలిపోగా బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ పరామర్శించారు. తొలుత కూలిన ఇంటిని పరిశీలించారు.

జాబితా తయారీలో బీఎల్వోలు కీలకం



గూడూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్

డోర్నకల్ : ఓటరు జాబితా తయారీలో బీఎల్వోల పాత్ర కీలకమని తహసీల్దార్ స్వాతిబిందు తెలిపారు. మండలంలోని అమ్మపాలెం గ్రామంలోని రైతువేదిక భవనంలో డోర్నకల్, సీరోలు మండలాల బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ఓటరు నమోదుకు సంబంధించి ఫారమ్ 6, 7, 8లపై బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం బీఎల్వోలకు శిక్షణ ఇచ్చి సామర్థ్యాలపై సాయంత్రం పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్, మాస్టర్ ట్రైనీలు మధుసూదన్, బి.శ్రీధర్, కె.శ్యాంసన్ సుధాకర్, డీటీ సుధాకర్ నాయక్, ఆర్ఐ రామా తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : ఓటరు నమోదు, సవరణ యాప్‌లపై బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు వడ్డెరగూడెంలోని రైతు వేదికలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్‌కుమార్ మాట్లాడారు. అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు కె.రాములు, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్ : ఎస్పీ శరత్ చంద్ర పవార్ను తొర్రూరు, నర్సింహులపేట ఎస్సైలు కే.జగదీష్, జీ.సతీష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సైలకు ఎస్పీ సూచనలు చేశారు. విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు.

జీపీ కార్మికుల సమ్మె



కేసముద్రం : భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

కేసముద్రం/కురవి/డోర్నకల్ : కేసముద్రం, కురవి, డోర్నకల్ మండలాల్లో పంచాయతీ కార్మికుల సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మాట్లాడారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేసముద్రంలో జీపీ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

డోర్నకల్ : హైదరాబాద్‌లో తలపెట్టిన ఆందోళన నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాసాని నాగేశ్వర్‌రావు, నాయకులు దేవా, గణేష్‌నాయక్, బస్సబోయిన ఉపేందర్ లను పోలీసులు అరెస్ట్ చేసి మధ్యాహ్నం వదిలేశారు.

కురవి : బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, కొణతం పెంటయ్యలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలేశారు.

పరిహారం మంజూరులో ప్రభుత్వం విఫలం

మరిపెడ : ఈ ఏడాది పంట నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరీలో ప్రభుత్వం విఫలమైందని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పుల్లూరు దేవయ్య, ఉప్పలయ్య, అనంతచారి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదు



మాట్లాడుతున్న దనియాకుల రామారావు

గార్ల : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే హరిప్రియకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యాలను వక్రీకరించారని ఆరోపించారు. 2019లో రేవంత్‌రెడ్డి సాయంతో కాంగ్రెస్ పార్టీ బీ ఫారం పొంది ఎమ్మెల్యేగా గెలిచి స్వార్థం కోసమే హరిప్రియ బీఆర్‌ఎస్‌లో చేరిందని తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీలు ఎం.వెంకట్‌లాల్, జి.నాగమణి, పి.సుజాత, శంషాద్ బేగం, పృథ్వీరాజ్, కోల కుమార్, పి.రామారావు, కొనకంచి రామకృష్ణ, పి.భిక్షపతి, పి.నర్సయ్య, వినోద, టి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఏ నియామకంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మరిపెడ రూరల్ : మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ సమాఖ్యలో కొత్తగా సీఏగా దూరు సుజాతను నియమించడాన్ని నిరసిస్తూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు మాట్లాడారు. సీఏ తీగల లలిత సమర్థవంతంగా పని చేస్తోందని, అవకతవకులు లేకుండా సంఘాలను నడిపిస్తోందన్నారు. వీఓ తీర్మాణం, సభ్యుల ఆమోదం లేకుండా కొత్త సీఏను ఎలా నియమించారని సీసీ మంగమ్మను నిలదీశారు. తనకేమి తెలియదని సీసీ చెప్పడంతో ఏపీఎం రాములు వచ్చి సమాధానం చెప్పే వరకు రుణం కిస్తీలను చెల్లించబోమని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కొత్త సీఏ సుజాతను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్, ఇందిర, రుద్రమదేవి, గంగోత్రి, వెలుగు, వెన్నెల, పుతిలిబాయ్, జీసెస్, ధనలక్ష్మీ, చంద్రబాబు, స్రవంతి, శ్యామల పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

● డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి : డోర్నకల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్యానాయక్ తెలిపారు. అనేక సంక్షేమ పథకాలు చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలని ఆయన ప్రజలను కోరారు. మండలంలోని మోద్గులగూడెం, జుజ్జూర్ తండా, గాజ తండా, తిర్మాలాపురం గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం ఆయన జోరువర్షంలోనూ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సునార్ తండా, బేగావత్ తండాలను కలిపి కొత్త జీపీని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ కవిత, ఎంపీడీఓ సరస్వతి, ఆత్మ చైర్మన్ తోట లాలయ్య, అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గాడిపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ నిరసన



గార్ల : నిరసన తెలుపుతున్న నాయకులు



పెద్దవంగర : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల : సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.శివ మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 1.70 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ స్కీమ్ అమల్లో ఉందన్నారు. సీపీఎస్ వల్ల ఉద్యోగులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.వీరూనాయక్, ఎం.రామచంద్రు, జి.భద్రునాయక్, జి.బాలాజీనాయక్, బి.భోజ్యానాయక్, శివాజీ, రమేష్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

పెద్దవంగర : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల ఓపీఎస్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలకుంట్ల చిరంజీవి ఆధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సుధాకర్, రమేష్, పద్మ, ప్రతిభ, ఊర్మిళ, అనిత పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్

మహబూబాబాద్ అర్బన్ : ప్రజలకు సురక్షిత మంచినీరు ఉచితంగా అందించేందుకు వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీనివాస్ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అనంతారం ఐదో వార్డులో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. బండి నవీన్ జ్ఞాపకార్థం దాతలు బండి శ్రీరామ్‌రెడ్డి, గార్లపాటి కృష్ణరెడ్డి కుమార్తె (ఎన్ఆర్ఐ) అనితరెడ్డి సహకారంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. వార్డు అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

వైద్యరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాజు, తదితరులు

గార్ల : వైద్యరత్న అవార్డు పొందిన స్థానిక సీహెచ్‌సీ వైద్యుడు రాజ్‌కుమార్ జాదవ్‌ను తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు యాదవ్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద గిరిజన కుటుంబంలో జన్మించి డాక్టర్ సీటు సంపాదించి వైద్యుడిగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకే రాజ్‌కుమార్ ఇటీవల మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా అవార్డు పొందాడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మీగడ శ్రీనివాస్, సంపసాల వెంకన్న, జడ శ్రీను, భయ్య సురేష్, వంగ వెంకటేశ్వర్లు, బి.కిరణ్, నంద కుమార్, చెన్నమల్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విపత్తుల నివారణకు చర్యలు

పెద్దవంగర : విపత్తుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. వర్షాల విపత్తులు తలెత్తితే సెల్ నంబర్ 63090 30288కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి

తొర్రూరు : ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల సతీష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడారు. పీఈటీలకు, పండిట్లకు పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. యూనియన్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. జినుగ విప్లవ్ రెడ్డి, పులి ముత్తిలింగం, నాయకులు పాల్గొన్నారు.

వేతనాల పెంపునకు ఒప్పందం

బయ్యారం : మండల కేంద్రంలో ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ), యజమానుల మధ్య జరిగిన చర్చలు ఫలించి వేతనాలు పెంచేందుకు గురువారం ఒప్పందం జరిగింది. డ్రైవర్లకు వేతనం రూ.10,500లు ఇచ్చేందుకు యజమానులు ఒప్పుకున్నారు. పెరిగిన వేతనాలు రెండేళ్లపాటు అమలులో ఉండేలా ఇరుపక్షాలు అంగీకరించాయి.

నారుమడిలో గుళికలు తప్పనిసరి

దంతాలపల్లి : మండలం రైతులు నాటువేసే వారం రోజుల ముందు నారుమడిలో కార్బోఫ్యూరన్ 3జి గుళికలు తప్పనిసరిగా వేయాలని దంతాలపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఆమె పలువురు రైతులతో మాట్లాడారు. గుళికల వినియోగం వల్ల వరిలో కాండం తొలుచు పురుగుల నివారణ జరుగుతుందని తెలిపారు.

సామాజిక సేవలు అందించాలి

తొర్రూరు : సమాజంలోని ప్రతిఒక్కరూ సామాజిక సేవలు అందించాలని బాలాజీ సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు నరుకుటి సంతోష్ ఆకాంక్షించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలో ఆ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. గోశాలలో గోవులకు దాణ, పండ్లు వితరణ చేశారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి

గార్ల : కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు సహకరించాలని ప్రజలను ఎస్సై బానోత్ వెంకన్న కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల సమీపంలోని పాకాల ఏరు చెక్‌డ్యామ్ మీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న క్రమంలో రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలు ఏరు దాటే ప్రయత్నం చేయొద్దని ఎస్సై స్పష్టం చేశారు.

ఎస్సై సతీష్ బాధ్యతల స్వీకరణ

నర్సింహులపేట : స్థానిక ఎస్సైగా గండ్రాతి సతీష్ విధుల్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మంగీలాల్ ఉద్యోగోన్నతిపై సీఐగా బదిలీపై వెళ్లడంతో తొర్రూర్ ఎస్సైగా పని చేసిన సతీష్ బదిలీపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని చెప్పారు. తొలుత మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎస్సై పూజలు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జమాండ్లపల్లికి చెందిన మత్స్యకారుడు బాషబోయిన రాంబాబు (30) గ్రామ సమీపంలోని మొండికుంటలో మావు పెట్టి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో మత్స్యకారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టి వెళ్లిన వ్యక్తి పోలీస్ కానిస్టేబుల్‌గా స్థానికులు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బయ్యారం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ బిందు గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పేదలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. బయ్యారం, ఉప్పలపాడుకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయించినట్టు తెలిపారు. ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఉప్పలపాడు ఉపసర్పంచ్ ఉషారాణితోపాటు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్ : మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన గుగులోతు మన్సీకి రూ.50 వేలు, గుగులోతు రంగమ్మకు రూ.20 వేలు, ద్వాలీకి రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు అందజేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గుగులోతు రాంబాబు, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, సర్పంచులు గుగులోతు లక్ష్మి లక్పతి, బానోతు బిక్కునాయక్, లబ్ధిదారులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి మృతి



కురవి : మండలంలోని కందికొండలో స్వాతంత్ర్య సమరయోధురాలు చిలుకపల్లి లక్ష్మి (90) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందగా గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహానికి స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నూకల లింగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ బి.రవీంద్ర గుప్తా, సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర నేత రమేష్ పాల్గొన్నారు.

సంతాపం

లక్ష్మి మృతి పట్ల అఖిల భారత స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం ప్రధాన కార్యదర్శి రాంపిల్ల జయప్రకాశ్, తెలంగాణ అధ్యక్షుడు వెంకయ్య సంతాపం వెలిబుచ్చారు. ఫోన్ ద్వారా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.